# మంచిని పెంచి చూడు

టి. విమలారామం

సుశీలకి ఆవేళ చాల ఆనందంగా వుంది.

బయట ఎండ అందంగా వుంది. అన్నాల దగ్గర పిల్లల పేచీలు ముచ్చటేసాయి. ఇంటి ముందు బీటదీసిన పిట్ట గోడ రోజూ మాదిరి చిరాకనిపించ లేదు. ముందు గదిలో మారుమూల సాలెగూడు కూడ ఇప్పుడు చివుక్కుమనిపించలేదు!

మనస్సులో సంతోషంగా వున్నప్పుడు లోకంలో అన్నీ అందంగా కనిపిస్తాయి. మామూలుగా చిరాకనిపించేవేవీ ఆ క్షణంలో చికాకనిపించవు!

సుశీల కావేళ అంత ఆనందంగా ఉండటానికి కారణం వుంది! ఎప్పుడో పన్నెండేళ్ళక్రితం పెళ్ళికి కొనటమే! మళ్ళీ మరో పట్టు చీర కొనలేదు భర్త! అతను కొనలేదని తాననలేదు. మనసులో కూడ అనుకోలేదు. కొనలేకపోయానని తానే పలుమార్లు అనుకున్నాడు. ఏవో అత్యవసరమయిన ఖర్చులు, మరేవో హఠాత్తుగా ముంచుకొచ్చిన ఇబ్బందులు, అతనికి వీలు చిక్కనివ్వలేదు.

సుధాకర్ చాల కచ్చితమయిన మనిషి. కాలేజీలో చదువుకొనే రోజులప్పట్నుంచీ అంతే! రేపు చేయవల్సిన పనికి ఈవేళనుంచీ ప్లాను వేస్తాడు. వచ్చే నెలలో కొనవల్సిన వస్తువు గురించి ఇప్పట్నించే పథకం వేసుకుంటాడు. ఆ ప్రణాళిక సానుకూలపడితేనే అమలు జరుపుతాడు. తన కందుబాటులో లేకపోతే వాయిదా వేస్తాడు. లేకపోతే పూర్తిగా ఆ సంగతే వదిలేస్తాడు. అంతేకాని, ఎక్కడోక్కడ అప్పయినా చేసి ఆ కోరిక తీర్చుకోవాలనుకునే తత్వం మాత్రం కాదతనిది!

అలా అతను వాయిదాలు వేస్తూ వచ్చిన ప్రణాళికలలో భార్యకి పట్టుచీర కొనటం అన్నది ఒకటి! ఇన్నాళ్ళ కాపథకాన్ని అమలు జరిపే అవకాశం అతనికి వచ్చింది!

సెలక్షనుగ్రేడు అర్రియర్సు, బోనసు, ఇంక్రిమెంటు అర్రియర్సు - ఇంచుమించు అన్నీ కలిసి ఒకేసారి వచ్చాయి. ఒక్కసారిగా మూడు వేలుపైచిల్లర వచ్చాయి.

"ఏం చేద్దాం ఈ డబ్బు?" భార్య ఏమంటుందో అని అడిగాడు సుధాకర్.

సుశీల చిత్రంగా చూసింది. "నన్నడుగుతా రేమిటి? మీకు తెలియదా యేం?"

"అదికాదు. ఏం చేస్తే బావుంటుందని నీ కనిపిస్తుందో చెప్పు!"

ఒకక్షణం ఆలోచించింది ఆమె. "మళ్ళీ మళ్ళీ ఇంత డబ్బు చేతికి రాదుగా! బంగారం కొని రాధ కేదయినా చేయిస్తే బావుంటుందేమోనని!"

"చేయించచ్చు. కాని, పిల్ల పెట్టుకొని బయటకు వెళ్ళే వయస్సూ లేదు. రోజులంత మంచివీ కావు! ఇక అలాంటప్పుడు నగలు చేయించి పెట్టెలో పెట్టుకొని ముచ్చట పడటామా?"

"అయితే, ఏం చేద్దామంటారు?"

"ఈ డబ్బుని మూడు వాటాలు వేస్తాను. వెయ్యి రాధ పేర్న, వెయ్యి ప్రసాద్ పేర్న ఫిక్సెడ్ డిపాజిట్‌లో వేస్తాను. ఇలా జాగ్రత్త చేస్తే వాళ్ళ కాలేజీ చదువుల నాటికో - పెళ్ళిళ్ళనాటికో చేతికంది వస్తుంది! ఇలాంటివి ఎన్నెన్ని చేస్తే అప్పటి ఖర్చులు దాటగలం మనం!" అని నవ్వాడు సుధాకర్.

"పోనీ, తక్కిన వెయ్యి కూడ ఫిక్సెడ్‌లో వేసెయ్యండి" అంది సుశీల ఏదో ఆలోచిస్తూ.

"డబ్బంతా బ్యాంకులో వేసుకొని ఇప్పుడున్న కోరికలన్నీ చంపేసుకుంటామా ఏమిటి?"

"అంటే, ఏం చేద్దామంటారు?" అని అడిగింది సుశీల కుతూహలంగా.

"ఎన్నాళ్ళనుంచో నీకో పట్టు చీర కొనాలని...."

సుశీల ముఖం ఎర్రనయింది.

"అదిగో అచ్చంగా నీ ముఖం ఎంత ఎర్రబడిందో అంత చక్కటి రంగులో ఒక చీర కొంటాను."

"ఎందుకండీ ఇప్పుడు?" అంది బిడియంగా.

"పట్టు చీర కొంటానంటే ఎగిరి గంతేసే ఆడదాన్ని చూసానుకాని నీలాంటిదాన్ని నేనెప్పుడూ చూళ్ళేదు!"

సుశీల చిన్నగా నవ్వింది. "లేనంతవరకే కావాలి కాలనిపిస్తుంది. తీరా కొనుక్కుంటే కట్టేదెన్ని సార్లు! పెళ్ళికో, పేరంటానికో తప్ప మామూలుగా పెట్టి పూజకేకదా!"

"మై గాడ్! మొగుళ్ళనవల్సిన మాటలు ఇలా పెళ్ళాలనటం మొదలు పెడితే కంచి పట్టు, కాశీపట్టు, పెద్దాపురం పట్టు.... ఈ పట్టు చీరలన్నీ ఏమయిపోతాయి?"

"వేళాకోళం కాదు. నిజం చెపుతున్నా. నా కింకో పట్టు చీర వుంటే బావుంటుందని ఇదివరకెప్పుడో అనుకున్నాను. కాని, ఇప్పుడు నిజంగా అలాంటి కోరిక నా కేదీ లేదు!"

సుధాకర్ చిత్రంగా చూశాడు.


"సమయం వచ్చింది కనుక చెపుతాను. నా కో కోరిక వుంది. మీరు తీరుస్తానంటే...."

"....ఏమిటో చెప్పు" అన్నాడు కుతూహలంగా.

సుశీల ముఖం ఎందుకో ఎర్రనయింది. "చెపితే నవ్వకూడదు."

"నవ్వనుగా!" అంటూ నవ్వేసాడు.

"అదిగో, అలా నవ్వుతారనే నేనింతవరకూ ఎప్పుడూ మీతో ఆ మాట సరదాగా కూడా అనలేదు. కాని, ఇప్పుడు డబ్బు చేతిలో వుంది. మీరవునంటే ఆ-



కోరిక తీరటం క్షణాలమీదవని."

"పిచ్చిదానా! ఈ వెయ్యి రూపాయలు నీకు పట్టుచీర కొనాలనే కేటాయించాను. ఈ డబ్బు నీది. నువ్వెలా నీ కోరిక తర్చుకున్నా నా కిష్టమే! ఏం కావాలో చెప్పు. నీకేం కావాలంటే అది కొంటాను."

అల్మారాలోంచి ఒక ఫోటో తీసి భర్తకి చూపించింది సుశీల. "ఈ ఫోటోలో వాళ్ళిద్దరూ ఎలా వున్నారు?"

"ఎలా వున్నారు? చూడ ముచ్చటగా వున్నారు!"

"ఆ అందమంతా మా చెల్లెలి మొగుడిది కాదు. అతను వేసుకున్న సూటుది!"

సుధాకర్ చకితుడయ్యాడు. "బలేదానివే!...."

"కాదంటారా? పెళ్ళికి మీరు చూసారుగా! ఫోటోలో అంత అందంగా ఉంటాడా అతను! రూపురేఖ లొక్కటేకాదు. వేసుకున్న బట్టలు కూడ మనిషికి అందాన్నిస్తాయి."

"ఇంతకీ ఏమంటావు? మీ మరిదిగారిలాగే నన్ను కూడ సూటు బూటు వేసుకొని నీ పక్కన నిలబడి ఫోటో తీయించుకోమంటావా?" అన్నాడు సుధాకర్.

అతని కళ్ళల్లోకి ప్రేమగా చూస్తూ అంది సుశీల. "అవునండీ! అదే నా కోరిక!"

కొన్ని క్షణాలపాటు నోరు తెరిచి చూస్తూండి పోయాడు సుధాకర్. ఆ తర్వాత అతనికి అంచెలంచెలమీద నవ్వు ముంచుకొచ్చింది.

"అదిగో! అలా నవ్వుతారనే నేనింతకాలం చెప్పలేదు" అంది సుశీల ముఖం తిప్పుకుంటూ.

భార్య భుజంమీద చెయ్యి వేసి "పిచ్చిదానా! పట్టు చీరనే పెట్టి పూజ చేయాలన్నదానివి ఒక్కసారి ఫోటోలో దిగటానికి నన్ను సూటు కుట్టించుకో మంటావా? ఇదెక్కడి కోరిక!"

"ఫోటో కోస మేమిటి? మీరు సూటు వేసుకొని ఆఫీసుకి వెడతారని."

"అంతా టాటాకులు కట్టటానికా?"

"అదేమిటి? మీ డబ్బెట్టి మీరు సూటు కుట్టించుకొని వేసుకుంటే ఎవరో ఎందుకంటారు?"

"చూడు సుశీ! మనం సంఘంలో వున్నప్పుడు 'మనకు మన యిష్టం వచ్చిన పనులు చేసుకుంటూ పోవటమేకాదు - ఎవరిచేతా వేలెత్తి చూపించుకోని విధంగా చేయాలి. నాతోటి వాళ్ళెవరూ వేసుకోరు. మా సూపరింటిండెంటుగారు కూడ సూటు ఎప్పుడూ వేసుకోవటం నేను చూళ్ళేదు. ఇప్పుడు నేను చేసే చిన్న చిన్న తప్పులు కూడ క్షమించి వదిలేసే ఆఫీసరుగారికి రేపు నేను చెయ్యని తప్పులు కూడ భూతద్దంలో కనిపిస్తాయి. సూటు, బూటు చూసుకొని మురిసిపోవటంకాదయ్యా - కాస్త ఆఫీసు





# మంచిని పెంచి చూడు

పనిమీద దృష్టి పెట్టుకొని చెయ్యాలి - అని చివాట్లు వేసినా ఆశ్చర్యం లేదు. ఏమిటి - లాటరీ తగిలిందా ఇంత దుబారా చేస్తున్నావు అని తోటివాళ్ళు హేళన చేయగలరు!"

"అంటే, మన బ్రతుకు మన యిష్టం వచ్చినట్టు బ్రతకటానికి లేదంటారా?" అంది సుశీల నిరుత్సాహంగా.

"మనిద్దరం అలా రోడ్డుమీద షికారు వెడుతున్నామనుకో! నువ్వు వయ్యారంగా అడుగులు వేస్తూ నడుస్తున్నావనుకో! హఠాత్తుగా నాకు మనసయిందని ఇలా నిన్నమాంతంగా కావలించుకుంటే అప్పుడు ఏమవుతుంది?..."

"...ఊఁ! ఏమిటీ పని, వీధి తలుపులు తీసి వున్నాయి.

సుధాకర్ పకపక నవ్వాడు. "మరి, ఇంట్లోనే నీ కలా అనిపిస్తే వీధిలో ఆ పని చేయలేనుకదా! అంటే, సమయం సందర్భం చూసి ఏ పనయినా చేయాలని అర్థం. దీనిబట్టి నల్గురికీ నచ్చని పనిని మనం చేయలేమని ఒప్పుకుంటావుకదా!"

"దానికీ దీనికీ ముడి పెడతా రేమిటి? అదీ యిదీ ఒకటిలా అవుతుంది?" అంది సుశీల చిరుకోపంతో.

"చాలామందికి నచ్చనిది ఏదయినా ఒక్కటే సుశీ! వాస్తవం చెప్పాలంటే నేను సూటు వేసుకోవటం నీకూ నాకూ ఇష్టం కావచ్చుకాని ఇంకెవరికీ ఇష్టముండదు. చివరికి మా అమ్మ మీ అమ్మగారు కూడ ఇష్టపడరు. పిల్లల చదువులు - పెళ్ళిళ్ళు ముందు ముందు పెట్టుకొని ఏమిటర్రా ఈ దుబారా ఖర్చులు అని అంటారు. నాతో కాదు - నీతోనే అంటారు. అలాకాక నీకు పట్టుచీరే కొన్నాననుకో ఇన్నాళ్ళకో మంచి పని చేసావురా అని మా అమ్మ అంటుంది. మా అల్లుడు ప్రయోజకుడయ్యాడని మీ వాళ్ళూ సంతోషిస్తారు. చివరికి మన పక్కింటి పిన్నిగారు కూడ నీ పట్టుచీర చూసి, సుధాకర్‌కి వాళ్ళావిడంటే ఎంత ప్రేమో అని మురిసిపోతుంది. కావాలంటె కట్టుకు వెళ్ళి చూపించు!..."

"సర్లెండి. నా మొగుడికి నామీద ఎంత ప్రేముందో అందరూ సర్టిఫికెట్ యిస్తే కాని నాకు తెలియదా యేమిటి?"

"ఈ రోజుల్లో సర్టిఫికెట్లు లేందే ఏ పనీ జరగటంలేదు మరి! అందులో ఆపెద్ద గెజిటెడ్ ఆఫీసరుగారి భార్య కూడాను" అని గలగల నవ్వాడు సుధాకర్.

చివర కెలాగయితేనేం భార్యని ఒప్పించాడు సుధాకర్. ఆవేళ సాయంత్రం తను పెందరాళే ఇంటికి వస్తానని, ఆమెను తీసుకొని బజారుకి వెళ్ళి పట్టుచీర కొంటానని చెప్పి వెళ్ళాడు.

సుశీల కందుకనే ఆవేళ చాల ఆనందంగా వుంది!

ఆమె కందుకనే కళ్ళకు కనిపించేదల్లా ఆనందంగా వుంది!

ఇంకా భర్త ఇంటికి రావటానికి రెండు గంటలుండగానే ముస్తాబయి కూర్చుంది!

ఆమె ఎదురు చూసిన క్షణం కాస్త ముందే వచ్చింది. వీధి తలుపులు భళ్ళున తెరచుకున్నాయి. చెప్పిన దానికన్న ముందే వచ్చాడు సుధాకర్. కాని, వచ్చినవాడు ఆశించిన ఉత్సాహంతో రాలేదు. కొంత నిరుత్సాహంతో పాటు తన కొలీగ్ శంకరాన్ని కూడ వెంటబెట్టుకొని వచ్చాడు!

"ఏమిటండీ? ఏమిటలా వున్నారు?" అంది సుశీల కంగారుపడుతూ.

"శంకరంగారి శేషుకి ఆక్సిడెంటయిందిట."

అప్పుడుకాని శంకరం వైపు పరీక్షగా చూడలేదు సుశీల. అతను దాదాపు స్పృహ తప్పి క్రింద పడిపోయేలా వున్నాడు. "అయ్యో పాపం! ఎలా జరిగిందండీ?" అంది మంచినీళ్ళు తెచ్చిస్తూ.

సుధాకర్ జరిగింది చెప్పాడు... పిల్లాడు ప్రొద్దున్న స్కూలుకి వెడుతున్నాడుట. కారేదో స్పీడుగా వస్తోంది. అది చూసుకోకుండా రోడ్డు దాటాడు. పెద్ద ప్రమాదం జరిగిపోయింది. దగ్గర్లోవున్న అప్పారావుగారి హాస్పిటల్లో చేర్చారు:

"పిల్లాడిప్పుడెల్లా వున్నాడు?" అని ఆత్రుతగా అడిగింది సుశీల.

"ఎడంకాలికి, ఎడం చేతికి ఆపరేషను చేసి ప్లాస్టర్లు వేసారు. ఇందాకనే స్పృహ వచ్చింది. చెప్పాలంటే పిల్లాడు చచ్చి బ్రతికినట్టు లెక్క" అన్నాడు సుధాకర్.

"బాధపడకండి అన్నయ్యగారూ! జీవితంలో ఇలాంటి ఒడిదుడుకు లేవోటి వస్తూ వుంటాయి. ఇలాంటప్పుడే మనం కాస్త ధైర్యంగా వుండాలి" అంది సుశీల.

శంకరం తలదించుకొని కూర్చుండిపోయాడు.

"నడవండి. మనం ఒకసారి హాస్పిటలుకి వెళ్ళివద్దాం" అంది సుశీల.

భార్య వైపు చిత్రంగా చూసాడు సుధాకర్. పట్టుచీర కొనుక్కోటానికి బజారుకి వెళ్ళాల్సిన ప్రోగ్రాము తమది! తనా సంగతి ఇట్టే మర్చిపోయిందా? ఆ మాట అనాలనే పైకి అన్నాడు సుధాకర్.

కష్టంలో శంకరం ఎదురుగా వుండగా భర్త ఇలాంటి ప్రశ్న వేస్తాడేమిటి? సుశీల ఇబ్బందిగా ముఖం పెట్టింది. "దాని కిప్పుడు తొందరేమొచ్చింది? మరో రోజున వెళ్ళచ్చులెండి" అంటూ వంటింట్లోకి వెళ్ళిపోయింది.

పది నిమిషాల్లో కాఫీ పెట్టి తెచ్చింది. అంతసేపూ వాళ్ళిద్దరిమధ్యా మాటలు లేవు. ఎవరి ఆలోచనల్లో వాళ్ళుండిపోయారు.

"కాఫీ తీసుకోండి. చల్లారిపోతోంది" అంది సుశీల.

శంకరం కాఫీ కప్పు అందుకున్నాడు.

"ప్రవేటు హాస్పిటలు. అంతా డబ్బుతో పని. ముందు ఆపరేషను చేసినందుకు వెయ్యి రూపాయలు పట్టుకురమ్మన్నాడు డాక్టరు. ఇంకా అక్కడ ఒక వారం ఉంచాలిట. ఎలా లేదన్నా ఇంకా ఐదారు వందలవుతుంది!" అన్నాడు సుధాకర్.

"మన అవసరం. ఏం చేస్తాం! ఏది ఏమయినా, పిల్లవాడు మనకు దక్కాడు. అదే ముఖ్యం" అంది సుశీల.


కొన్ని క్షణాలు ఆ గదిలో మౌనం నృత్యం చేసింది.

"కూర్చున్నారేమిటి? నడవండి హాస్పటలుకి వెడదాం!" అంది సుశీల.

"ముందు మనం వాళ్ళకి చేయవల్సిన సాయం మరొకటుంది."

"ఏమిటి?"

"శంకరం దగ్గర బొత్తిగా డబ్బేమీ లేదుట!"



"అదేమిటి?..." అని అర్థోక్తిలో ఆగిపోయింది సుశీల. సుధాకర్‌కి అరియర్స్ డబ్బు వచ్చినట్టే శంకరానికీ వచ్చింది. ఇంకా నిజం చెప్పాలంటే అతనికి మరో రెండు వందలు ఎక్కువే వచ్చాయి. ఆ డబ్బు వచ్చి రెండు రోజులు కాలేదు. అప్పుడే అంతా అయిపోయిందా? సుశీల మనస్సులోని ప్రశ్న అలా బయటకు వచ్చింది.

శంకరం సిగ్గుతో చితికి చచ్చిపోయాడు. "సరోజ ఎన్నాళ్ళనుంచో అంటోందని నిన్ననే వెళ్ళి కుకింగ్ రేంజ్ కొన్నాను. ఏ బంగారమో అయితే తిరిగి అమ్మేసి డబ్బు తెచ్చుకోవచ్చు. ఇప్పుడేం చెయ్యను? ఎవర్నడిగినా డబ్బు లేదంటున్నారు. అవమానం నా దగ్గర అప్పు తీసుకొనేవాడు గుర్నాథం. ఇవేళ నా అవసరం వచ్చినప్పుడు ఏమీ లేదని మొండి చెయ్యి చూపించాడు..."

"రెండు వందలో మూడు వందలో అంటే ఎవరో ఒకరు సర్దుతారు. మరి వెయ్యిన్నర కావాలంటే ఎవరుమాత్రం తెచ్చివ్వగలరు?" అన్నాడు సుధాకర్.

శంకరం ముఖం కందగడ్డలా వుంది. "నువ్వన్నది నేను కాదనటం లేదు. నాకు వచ్చినట్టుగానే అందరికీ డబ్బు వచ్చింది. ఎవరు ఖర్చులు వాళ్ళవి."

కొంతసేపాగి "మనం ఎంత డబ్బు యివ్వగలం!" అన్నాడు సుధాకర్ భార్యతో.

సుశీల ముఖం ఇబ్బందిగా పెట్టింది. అతనడిగితే భర్త తను చేయగల్గిందేదో చేయాలి కాని, అతని యెదురుగా తన సలహా ఏమిటని బిడియపడింది.

"నేను ప్రతీదీ ఒక ప్లాను ప్రకారం చేస్తాను. అలా చేస్తే కాని నాకు సంతోషంగా, సంతృప్తిగా ఉండదు. మా రాధ పేర్న, ప్రసాద్ పేర్న వెయ్యేసి రూపాయిలు ఫిక్సెడ్ డిపాజిట్‌లో వేద్దామనుకున్నాను. బ్యాంకులో ఈవేళ వేద్దామనే కూడా డబ్బు తెచ్చాను. కాని మీ పిల్లాడికి ఆక్సిడెంట్ అయిందని తెల్సి ఆగిపోయాను. నువ్వడక్కముందే నీ కవసరం రావచ్చేమోనని రేపటిదాకా నా పనిని వాయిదా వేశాను. ఈవేళ మా ఆవిడకి చీర కొనాలనుకున్న సంగతి నువ్వు విన్నావు. ఆవిడ దానికీ వాయిదా వేయటానికి సిద్ధపడుతోంది..."

"నా కంత డబ్బు అక్కర్లేదు. పదహారు వందలు చాలు. మీ ఆవిడ ఇవేళే చీర కొనుక్కోవచ్చు" అన్నాడు శంకరం తడబడుతూ.

"ఇందులో ఏది ముఖ్యం అన్నది ఎవ్వరూ చెప్పలేరు. నాకు ముఖ్యమైనది నీకు ముఖ్యం కాకపోవచ్చు. నీకు ముఖ్యమయినది నాకు కాకపోవచ్చు. ఎవడి ఆలోచన వాడిది. ఎవడి అవసరాలు వాడివి."

శంకరం మాట్లాడలేదు.

"బహుశ నా మాటలు నిష్కర్షగా వుండచ్చు నీకు."

శంకరం బలవంతంగా నవ్వాడు. "అబ్బే. నువ్వన్నదానిలో తప్పేముంది!"

"నీకు పదహారు వందలూ ఇవ్వటానికి నా కభ్యంతరం లేదు. కాని, ఏ ప్రయోజనం లేకుండా ఇలా డబ్బివ్వడం నాకిష్టం లేదు."

"నేను కాదనను సుధాకర్! నెలకి నాల్గు వందలు చొప్పున నాల్గు ఇన్‌స్టాల్‌మెంట్సులో తిరిగి ఇచ్చేస్తాను. బ్యాంకు యింట్రస్టు కూడా యిస్తాను."

"అది నాకు చాలదు. నెలకి ఐదు వందల చొప్పున నాల్గు నెలలపాటు యివ్వాలి!" సుధాకర్ గొంతులోని గాంభీర్యానికి సుశీల చకితురాలైంది.

భర్త యిలా అంటాడేమిటని ఆమె వెలవెల బోయింది.

శంకరం తెరిచిన నోరు తెరిచినట్టే ఉండి పోయింది.

"నీ అవసరం చూసి అలా అడుగుతున్నానని నీ కనిపిస్తే అనిపించివుండచ్చు. కాని, నా నిర్ణయం మాత్రం యిది. మనసులోని మాట చెప్పాను. అంత్య నిష్ఠూరంకన్న ఆది నిష్ఠూరం మేలు!"

ఇంక సుశీల భరించలేకపోయింది. "వేళాకోళాని కదండీ సమయం" అంది కాస్త వాతావరణాన్ని తేలిక పరుద్దామని.

"ఇది వేళాకోళం కాదు సుశీ! నిజం!"

"సరే సుధాకర్! ఏ ప్రయోజనం లేకుండా నిన్నిబ్బంది పడమనటం నాకూ భావ్యం కాదు. నువ్వన్నట్టేకానీ! అత్యవసర పరిస్థితిలో ఆదుకుంటున్నావు. నాకదే చాలు! నీ మేలు ఎప్పటికీ మర్చిపోను" అన్నాడు శంకరం.

* * * * * * *

నాలుగు నెలలు గడిచిపోయాయి.

"ఇదిగో ఆఖరి యిన్‌స్టాల్‌మెంటు..." అంటూ ఐదొందలు సుధాకర్ చేతిలో పెట్టాడు శంకరం.

"అన్నమాట నిలబెట్టుకున్నావు" అన్నాడు సుధాకర్ చిరునవ్వుతో.

శంకరం ముఖం గంటు పెట్టుకున్నాడు. "నా దగ్గర మాటంటే మాటే!"

"సరే, సాయంత్రం నేనూ, మా ఆవిడా మీ యింటికోసారి వద్దామనుకుంటున్నాం!"

"అంతా యిచ్చేసానుగా!" అన్నాడు శంకరం నొసలు చిట్లించుకొని.

"డబ్బు బాకీ తీరిపోయిందికదా - ఇంకా నువ్వు మా యింటికి రావటం ఎందుకు" అన్నట్టుంది అతని స్వరం!

అదేం పట్టనట్టు "నీతో మరో ముఖ్యమయిన సంగతి మాట్లాడాలి" అని చెప్పి యింటికి వచ్చేసాడు సుధాకర్.

గుమ్మంలోనే వాడిన ముఖంతో ఎదురయింది సుశీల. "మీరు అందర్కీ మేలు జరగాలని ఆలోచిస్తారు. కాని, అవసరం వచ్చినప్పుడు దేవుళ్ళలా కనిపించిన వాళ్ళమే-ఇప్పుడు వాళ్ళ పాలిట డబ్బు లాక్కునే పిశాచాల్లా కనిపిస్తున్నాము...."

"ఏమయింది? ఎవరి సంగతి?"

"సరోజ వచ్చింది. ఇన్నాళ్ళు మొగుడు తనకు చెప్పలేదట! నాల్గు నెలలకి నాల్గు వందలు వడ్డీ పడికాముట! నీ జరీ పట్టు చీరకి అది సరిపోతుందా -ఇంకా ఏమయినా పైనపడితే చెప్పు తెచ్చిస్తా -అంటూ నా నా మాటలూ అని వెళ్ళింది" సుశీల కళ్ళు నీళ్ళు నింపుకున్నాయి.


"బాధపడకు. పడ్డవాళ్ళు ఎప్పుడూ చెడ్డవాళ్ళు కారు. నిజానిజాలు తెలియక ఆవిడేదో అంది. ఇప్పుడు చెపుదాము పద! నిన్ను తీసుకొని వస్తానని శంకరంతో చెప్పి వచ్చాను" అన్నాడు భార్య భుజంమీద వాత్సల్యంగా చేయి వేసి నొక్కుతూ.

మరో పావు గంటలో తయారయి వచ్చింది సుశీల. ఎప్పట్లా కూడ హడావిడిగా ముస్తాబు చేసింది. ఒక

కూపన్
ఆంధ్ర సచిత్ర వార పత్రిక
చింతలూరు ఫార్మసీ
చింతలూరు ఆయుర్వేద ఫార్మసీ వారి
వైద్య సలహాలు
ప్రశ్న: ..................................................
..................................................
పంపినవారి పేరు: ..................................................
పూర్తి చిరునామా: ..................................................

ధర్మపథం

# గోమాత విలువ



భగవంతుడు సర్వ వ్యాపి. స్థావర జంగమాలలో కూడ దైవ శక్తి ఉన్నదని విజ్ఞుల అభిప్రాయం. అందువల్ల మన వారు దేవాలయాలను కట్టి విగ్రహ ప్రతిష్ఠ చేసి దైవారాధన జరుపుతున్నట్లే స్థావరాలనూ, మానవేతర జీవాలనూ పూజించడం సంప్రదాయం. శ్రీ కృష్ణుడు గోవర్ధన పర్వతాన్ని పూజించినట్లు మనకు తెలుసును. వృక్షాలలో అశ్వత్థ వృక్షాన్ని పూజించడం, పశువులలో గోవును పూజించడం ప్రసిద్ధం.

వాస్తవానికి గోమాత దైవ స్వరూపం. భూమి వలెనే ఎంతో శాంతమైనది. కొట్టి బాధించినా పాలు ఇవ్వడం మానదు. ఉదయాన్నే గోదర్శనం మిక్కిలి శుభప్రదమైనది. అందువల్ల పెద్దలు గోసంరక్షణ చేస్తూ, ఉదయాన్నే గోవును చూచి తృప్తి పడుతూ ఉంటాయి. భగవత్ స్వరూపులైన కంచి కామకోటి పీఠాధిపతులైన పరమాచార్యాది స్వాములు తమ దేవతారాధనా నంతరం విధిగా గోపూజను చేస్తూ ఉంటారు. పశువులలో గోవంత అమాయక మైనదీ పూజ్యమైనదీ మరి యొకటి లేదు. గోవు సార రహితమైన గడ్డిని తిని సారవంతమూ, ఆరోగ్య కరమూ అయిన క్షీరాన్ని మనకు ఇస్తున్నది. ఆవు పాలు మాత్రమే కాదు. గోమయం కూడా మన కెంతో ఉపయోగ మైనది. దాని మూలంగా తయారైన భస్మం పరమ పవిత్రమై, ఆస్తికుల లలాటానికి అలంకారమై ఉన్నది. గోమాత విలువను గ్రహించిన వారెవ్వరూ దానిని హింసించరు.

కొందరు గోవధను చెయ్యడం కాన వస్తున్నది. దానికి తీవ్రమైన మతాభినివేశమే కారణమని ఊహించ వచ్చును. ఒక మతం వారు గోవును దేవతగా పూజించడం వల్ల ఆ మతాన్ని విరోధించిన వారు గోవును చంపుట జరుగుతూ ఉండ వచ్చును. మత విద్వేషం చాలా చెడ్డది. పూర్వం కళింగ దేశం బౌద్ధుల పవిత్ర స్థలం. అనేక విహారాలూ, స్తూపాలూ అక్కడ ఉండినవి. ఆ కారణం వల్ల బౌద్ధ మతాన్ని ద్వేషించిన వైదిక మతస్థులు, కళింగ దేశం అపవిత్ర మైనదనీ, ఆ దేశంలో నివసించ కూడదనీ, ఆ దేశానికి వెళ్ళినా కూడా పాపం సంభవిస్తుందనీ భావించేవారు. దీనిని గోహత్యకు దృష్టాంతంగా తీసుకో వచ్చును.

పవిత్రమైన గోమాత విలువను గ్రహించి, దానిని బాధించక అభిమానంతో చూడడం అందరికీ ధర్మం.

– బులుసు వేంకట రమణయ్య

# మంచిని పెంచి చూడు

చెప్పి మీ ఆవిడచేత కాగితాలమీద సంతకాలు పెట్టించి తీసుకువెళ్ళాను. నీకు చెప్పటం మర్చిపోయిందేమో!" అన్నాడు సుధాకర్ సరోజ వైపు చూసి నవ్వుతూ.

"అవును. అప్పుడు పిల్లాడికలా వుంటే నాకు మతి మతిలో లేదు. మీరేదో అడిగారు. నేను సంతకం పెట్టాను. ఆ తర్వాత నా కా సంగతి గుర్తే లేదు. నిజంగా మీరు మాకింత ఉపకారం చేస్తూ కూడ నా నోటమ్మట యింత పాడు మాటలు వచ్చేవరకూ వూరుకున్నా రెందుకని! ఈ సంగతి ఆనాడే ఎందుకు చెప్పలేదు?" అంది సరోజ ఎంతో నొచ్చుకుంటూ.

"కొంత పొదుపుచేస్తే కాని అది మీ కిచ్చే బలం మీకు తెలియదు. ఆవేళ మీ పిల్లలపేర్న వేసిన వెంటనే చెప్పాననుకో - ఒక నెల ఎలాగో జరిగింది. ప్రతి నెలా జరిపించగలమా అని మీరు మానేసే ప్రమాదం వుంది. మాట కోసమనో - అప్పు తీర్చాలన్న బాధతోనో మొత్తానికి ఈ నాల్గు నెలలనుంచీ మీకది ఒక అలవాటయింది. కష్టపడి యిలా చేయగలిగిన వాళ్ళు - సంతోషంగా ఎందుకు చెయలేరు? ఏన్నాక మంచి అలవాటుగా ఎందుకు మార్చుకోలేరు?, మార్చుకోగలరని నమ్మకం కల్గిన తర్వాతనే మీ కీ సంగతి చెప్పాను" అన్నాడు సుధాకర్ నిండుగా నవ్వుతూ.

"అంటే, ఆ నమ్మకం కలక్కపోతే మరికొన్నాళ్ళు మాచేత తిట్లు తినటానికి సిద్ధపడేవాడివన్నమాట!" అన్నాడు శంకరం నవ్వుతూ.

"అవును. ఒక మంచిని సాధించగలనన్న నమ్మకం కలిగినప్పుడు ఈ తిట్లు లెక్కలోకి రావు. అసలు పొదుపు చేసుకొనే వాళ్ళంతా పిసినిగొట్టువాళ్ళని కొందరనుకుంటుంటారు. కాని, కొందరలా జాగ్రత్త పడేవాళ్ళు ఉండబట్టేకదా మరికొందర్కి అప్పు దొరుకుతోంది. అంతా ఖర్చు పెట్టేవాళ్ళే వుంటే బ్యాంకుల్లో డబ్బంటూ ఎక్కడుంటుంది? ఇవేళ చేతిలో పది వుంటే పదీ అయిపోతుంది. వంద వుంటే వందా అయిపోతుంది. ఎంతో కొంత ఆదా చేస్తే అత్యవసరంలో అదే మనల్ని ఆదుకుంటుంది. ఇదిగో నేను మొదలు పెట్టిన పనిని మీరు కంటిన్యూ చేస్తే మీ పిల్లల భవిష్యత్తు గురించి మీరు వర్రీ కావల్సిన అవసరం వుండదు. పసరానికి తిన్నది పుష్టి, మనిషికి ఉన్నది పుష్టి - అని పెద్దవాళ్ళు వూరకనే అనలేదు. ఇందుకనే!" అన్నాడు సుధాకర్.

"నువ్వెన్ని చెప్పు. నీ క్రెడిట్ నీది కాదు. మీ ఆవిడది! భార్య సహకారం లేకుండా భర్త యేమీ చేయలేడు!" అన్నాడు శంకరం సరోజ వైపు కొంటిగా చూసి నవ్వుతూ.

"మీరలా అన్నందుకు నేనేం ఉడుక్కోనులెండి..." అంటూ సుశీల దగ్గరికి వచ్చి ఆమె చేతులు పట్టుకుంది సరోజ. "అన్నయ్యగారు మాకు మంచి చేస్తున్నారని తెల్సుకోకుండా నిన్ననరాని మాటలన్నాను. నన్ను క్షమించు సుశీలా!"

"అయ్యో! అంత మాటెందుకు సరోజా! మీకు మంచి జరిగితే మాకు మంచి జరిగినట్టుకాదూ!" అంది సుశీల నిండు మనస్సుతో. □